# తి ట్లూ శా ప నా ర్థా లూ

"తిట్టుకీ శాపనార్థానికీ తేడా యేమిటి?" అని అడిగింది బుల్లెమ్మ. బుల్లెమ్మ తెలుగు యమ్మే అయి, రిసెర్చి చేయాలని సంకల్పించుకున్నది. ఓ గైడ్‌ని ఆశ్రయించింది. టైటిల్ యిచ్చేదాకా అవతారాలు మార్చింది. కుక్, ఆయా, హౌస్ కీపర్, డ్రైవర్, వర్తాహరి. అప్పటికి గైడుగారి మనసు కరిగింది. సెమినార్లతో కాలం వెళ్ళదీయటం ఆపేసింది. వండర్‌ఫుల్ టైటిల్ యిచ్చింది. యంఫిల్ గడువు రెండేళ్ళు. ఏణ్ణర్థంలో నూటయాభై పేజీల సిద్ధాంతం రాసి గైడుగారిచేత మెప్పు పొందాలి. తర్వాతింకా టైప్ తతంగం అవీ వున్నాయి. యంఫిల్ డిగ్రీ రావటానికి మరో యేడాది వేచి చూడాలి.

ఆ టైటిల్ చూసి బుల్లెమ్మ బాగా నవ్వింది.

"నవ్వెందుకొచ్చింది?" అన్నది గైడుగారు.

"నాకు వాటి తేడాయే తెలియదు మేడమ్. నేను మా అమ్మా నాయనలకు కడగొట్టు బిడ్డని. గారంగా పెంచారు. వస్తు సేకరణ కష్టమేమో మేడమ్" నవ్వుతూనే కంటిన్యూ చేసింది బుల్లెమ్మ. "వాటిని సేకరించాలంటే యెవరినన్నా ముక్కోపిని గానీ, షార్ట్ టెంపర్ గలవారినిగానీ ప్రవోక్ చేయాలేమో! వూరికేనే లభిస్తాయా? మరో టైటిల్ చూడండి మేడమ్."

"స్త్రీల పాటలూ, సామెతలూ, నోములూ వ్రతాలూ వాటి కథా కమామిషూ" గైడుగారు చెప్పుకు పోతున్నది.

"అవీ అంత తేలిక గాదు మేడమ్. మా వదిన అక్కా చేశారు. బాలా యాతనైంది" అయిష్టత వెల్లడించింది బుల్లెమ్మ.

"బాలెడ్స్ తెలుగులో వుండేవి. ఇప్పుడవి అంత ప్రచారంలో లేవనుకో" గైడు అన్నది.

"మీకొచ్చా? కొన్ని వుదాహరణ లివ్వగలరా?" అడిగింది బుల్లెమ్మ.

"పురాణగాథలు, జానపద గాథలూ పాటలాగా పాడేవారు వేడుకల్లోనూ పాడేవారు. చిమ్మిలి తొక్కేప్పుడు రాముని కథ టూకీగా పాడేవారు."

"చిమ్మిలి అంటే?"

"ఆంధ్రా కాదా నువ్వు? తెలుగుదేశంలో పుట్టలేదూ? ఆడపిల్ల వయసురాగానే పుష్పవతి అనిపించుకుంటుంది. వేడుకచేస్తూ స్నానం అయాక గానీ లేదా మూడునాళ్ళు గానీ నువ్వులూ, బెల్లం, యెండుకొబ్బరి దంచుతూ వేడుకపాట పాడుతారు దంచే ముత్తైదువలు. 'వీర రసమ్మున విల్లారూఢిగ విల్లు + ఆ రూఢిగ ఖండించీ వేడుకతో వైదేహిని పెండ్లాడి వచ్చెనే రామచంద్రా! కొన్ని మోటుగా వినిపిస్తాయి. 'వెఅద సీతకు సమర్తవేడూకూయే అసులీ్య.' అలాగే పారిజాతాపహరణం, సవతుల కయ్యం, మార్కండేయుని కథ. బాలనాగమ్మ, రుక్మాంగద చరిత్ర పాముపాట, మంచి తెలుగు పదాలు, మతమూ భక్తీ అన్నీ వస్తాయి. 'కాళింగమర్దనంలో కృష్ణుడు భయం నటిస్తూ అక్కడికి సాధించి వచ్చితే పామూ అట్టూకపై నెక్కి కూర్చుందునసెనూ'."

"అట్టూక అంటే."

"అటక అదీ తెలియదూ? కారు తోలటమెలా నేర్చావూ? బువ్వంబంతిలో ఫిలాసఫీ వినిపిస్తుంది."

"బువ్వంబంతి అంటే?"

"తెలుగమ్మాయివే! లంచ్. డిన్నర్, తెలిసిందా?"

"అవి మరీ కష్టమేమో మేడమ్. వృద్ధులైన పాతకాలపు అలవాట్లూ ఆచారాలూ వున్నవారిని వెతికి పట్టాలి. మోడరన్ ఓల్డ్ పీపుల్‌కి రావు. పట్నవాసమైపాయె!"

"తోక మడవకు. పట్టుదలుండాలి. వేళ్లు వంచనిదీ వెన్న రాదు. జానపదగీతాలు అని పెట్టుకుంటావా?"

"వద్దు, అత్తకూతురు సరళ చేసింది, తల పట్టిపోయింది. నా ప్రశ్నకి జవాబు చెప్తారా పోనా మేడమ్?" అని లేచింది బుల్లెమ్మ గైడుగారూ లేచింది కుర్చీలోంచి. "దూషిస్తూ నొప్పి కలిగేట్టు మాటలంటే తిట్లు, శాపనార్థాలూ, కసినీ, ద్వేషాన్నీ, అసూయనూ, యీసునూ వెల్లడిస్తాయి. మండలానికీ మండలానికీ మళ్లా తేడా వుంటుంది. తెలంగాణా, రాయలసీమ, ఆంధ్రా, కోససీమ, పలనాటిసీమ, వాడుకలు వేరు. బాగా గ్రంథాలు చదవాలి. కన్యాశుల్కంలో 'నీ యింట కోడికాల్చా' అనే శాపనార్థం వాడబడింది. 'నీ కడుపుమాడ, నిన్ను ఒలుకుల్లో పెట్ట, నిన్ను నరికి పోగులు పెట్ట' అచ్చమైన ఆంధ్ర శాపనార్థాలు.

"పన్నెండయింది మేడమ్. ఇవాళ్టికివి చాలు" బుల్లెమ్మ గేటు దాటింది.

## 2

"పెళ్ళికెళ్లాలి మరో జత గుడ్డలు సూట్‌కేసులో పెట్టుకో" అన్నది అనసూయ.

"నేను పరిశోధన జరుపుతున్నాను. నువెళ్లిరా" అన్నది బుల్లెమ్మ.

"వ్రాతపరికరాలు గూడా పెట్టిలో సర్దుకో. విరామ సమయంలో అక్కడ వేసుకోవచ్చు. నీకిచ్చిన టైటిల్ నే చూశాలే. మన వాళ్ళందర్నీ కలుసుకోవచ్చు. కొత్త పరిచయాలు చేసుకోవచ్చు. మాచ్ అందచ్చు, నీవూ వయసు వెల్లిస్తావా యేం? నాకెటూ వెల్లి పోయింది. నాకూ టైమ్‌లేదు. ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో ఇరవై నాలుగ్గంటలూ రోగాలు వినాలి, కుదర్చాలి, శస్త్రచికిత్సలు, ప్రిస్క్రిప్షన్స్, ఎమర్జన్సీ కేసులు, అంతే. ఓ సరసం లేదు, విరసం లేదు. హాస్యం అసలే లేదు. తలనెప్పి, రెండు పబ్లిక్ హాలిడేస్ మూడోరోజు ఆదివారం రాత్రికి యిల్లు చేరుదామా సరేనా? లేమరి" అన్నది అక్క అనసూయ.

అలా అక్క వత్తిడితో బుల్లెమ్మ పక్క జిల్లాకి పెళ్ళికి వెళ్లింది. వీరిద్దరు మగపెళ్లివారి వేపే. విడిదిచ్చారు ఆడపెళ్ళివారు. అంత వసతిగా లేదు. సర్దుకుపోవాలి. సరిపెట్టుకోవాలి. మూడ్రోజులు రెండుపూటలా కాఫీ ఫలహారాలూ, భోజనాలూ, గౌరవ మర్యాదలూ అందుతాయి. ఒక గదిలో పదిమంది సర్దుకోవాలి. వరండాలో నిద్ర తీయచ్చు, పెట్టె బెడ్డింగు గోడలోపలికున్న బీరువాలో సర్దారు.

పిలుపు వచ్చింది మేళతాళాలతో. వెళ్ళి అల్పాహారం కానిచ్చి వచ్చారు. బెడ్డింగ్ పరిచి మేను వాల్చారు యెనిమిదింటికి మళ్లా ఆహ్వానిస్తారు. సాయంత్రం చల్లబడింది. కళ్ళు తెరుపుఁబడి లేచారు. పెద్ద గలభాగోల వినవచ్చింది. కొందరు లేచి వెళ్ళి కిటికీలలోంచి చూస్తుంటే, గదివాకిలి తీసి దొడ్డివేపు వెళ్ళి నిలబడి చూచారు కొందరు. ఆ రెండిళ్ళకీ మధ్య ప్రహారీగోడ పొట్టి, అవతలివారు బాగా కనబడతారు. దొడ్డివేపు ఖాళీ స్థలంలో రంగస్థలంలో సీను బాగా కనబడుతుంటే వినోదిస్తూ నిలబడి ప్రయాణ బడలిక మరిచారు.

గొంతులు వాల్యూమ్ హెచ్చినై. కూచిపూడీ స్టైల్లోనూ భరత శాస్త్ర పద్ధతిలోనూ, ఆంధ్రనాట్య వైఖరిలోనూ విన్యాసాలు చేస్తూ, కాళ్ళూ, చేతులూ, తలా, కళ్లూ, కొప్పూ, ముక్కూ మూతీ ముక్కు పుటాలూ కదిలిస్తూ యింపైన, సొంపైన దూషణ అనర్గళంగా వల్లె వేస్తున్నారు. ఆహార్యమూ తగి వున్నది.

"యేమిటే పేలుతున్నావూ? వినలేక ఛస్తున్నానూ, మాపాటి వారు భూపాటాన లేరని, నడమంత్రపు సిరి చెప్పినట్టు ఆడు తున్నావే! గురివిందగింజ తన నలుపెరుగదని, మదనష్టపాస్తి పోగు చేసుకుని, కన్నూ మిన్నూ గానక, పిన్నాపెద్దా గమనించక, నోటికి స్వేచ్ఛ యిచ్చావే! చేతులూ ఝాడిస్తున్నావే. నీ నోరు బడి పోనూ, నీ నాలుక సుద్దీబద్దం యెరగదే. నీ గొంతుకోయ్యా, నీ చేతులు పడిపోనూ, నీ తలపండు పగలా. నీ అబ్బతో మొత్తుకో.

తాత్తో చెప్పుకో వాళ్ళిద్దరూ నన్ను తలకొట్టి మొలేస్తారా? నిన్ను పాతెయ్య. నోట్లో గడ్డ పెట్టిస్తా, యేం వుద్యోగం వెలిగిస్తున్నాడే నీ మొగుడు! లింగం మీద నీళ్లు పొయ్యటమేనా. నీ తాడు తెగా, యెవడికి పుట్టిన బిడ్డవురా వెక్కి వెక్కి యేడ్చేవూ అని. వాడెబ్బ యెవరో వాడికి తెలుసా. దారినపోయే దానయ్య పిలిచి, నీకు మూడుముళ్లు వేయించారు. నీకన్నవారు కలెక్టరులా, కలక్టరమ్మ మొగుళ్లా? చేటు కాలమునకు చపలాయ నీకూ దొంగచాటుగ నీవు తొంగి చూచేవూ అన్నట్లు. పక్కచూపులూ, దొంగచూపులే. అదేం రోగం గుడ్లు పీకించేను. అటువేపు గోడవేపు వెళ్ళి చూడలేదా?'' గ్రామఫోను రికార్డులాగా వెళ్ళినై తిట్లు. యెదురుగా అభినయిస్తూ వింటున్న స్త్రీ ప్లేటు రెండోవేపు పెట్టినట్టు అందుకున్నది.

"మనిషివా? కుక్కవా? మొరుగుతున్నావే? అన్నంగాదూ నువ్వు తినేదీ? పెంట పోగునందు పెద్ద రత్నంబున్న విడిచి చనునె యెంత వెర్రి అయినా అన్నట్టు మా ఆయన తెచ్చిన రత్నాలెక్కడివో యెరుగవా? ఇతరులెరుగరా? ఒక్కటి సాక్ష్యమే గాదూ, తంపీలు పెట్టి కోర్టుకెక్కించి, రెండుపార్టీల వారనించి డబ్బు లాగి, తేలిగ్గా పోనిస్తానని, వాయిదాలు వేయించీ, ఆ ప్రభువుకి నేను దగ్గర మనిషి నని నమ్మించి నీ పని చేయించి పెడతానని, సీసా అందించాలని, ఆ సీసాలో సగం తను పూర్తిచేసి నకిలీ సరుకుతో నింపి మూత బిగించి యివ్వటం మర్యాదా? ఆడవాళ్ళను చెల్లించి, మత్తు అమ్మించటం గౌరవమిస్తుందా. అవన్నీ గౌరవమిస్తే, ముదనష్టమూ, నడమంత్రపు సిరీ మంచివే నీ దుంప తెగా! ఆడిపోతున్నావు అసుర సంధ్యవేళ పూనిందేమో! భటాచోర్., తైరుపోసీ, కాకా పట్టీ, యిచ్చకాలాడీ అన్నీ వుచితంగా తెచ్చుకునేదానివి నువ్వా నన్ను

దుమ్మెత్తి పోసేదీ? నీ తమ్ముడినేమంటారే పుండాకోరంటే? నాకర్థం గాలేదు. నువే చెప్పాలి మరి, నీ తల నేలబడా!" ఇళ్ళల్లోనించి, ఆ పెద్ద యింటిని అయిదుభాగాలు చేసి అద్దెలకిచ్చారు ఓనర్సు, మగవాళ్ళు వచ్చారు. వారివెనక కర్రపోటు వేసుకుంటూ వృద్ధ మాతలూ, అత్తలూ వచ్చారు. రగడ ఆపటం పోయి, రంగం యింకా రంజుగా వేశారు.

"మురుగులో రాయి విసిరితే, మురుగుబింది మీద పడుతుందే పిచ్చిమొహమా. బురదపందిమీద రాయి విసిరితే, బింది బురద నీమీద పడుతుందే మతిభ్రష్టా. పంది చర్మం మందం గాదూ, దెబ్బ తాకదు. "నడివయస్కురాలు తన కోడలికి బుద్ధి గరపింది. వీధిలైట్లు వెలిగినై. వారు గమనించలేదు. రగడ పాకానబడింది. జనం కతారుతీర్చీ, మెడలు రిక్కించీ వినోదిస్తూ చిక్కబడుతున్నారు. మగవారిలో పౌరుషం పొడుచుకొచ్చి శిఖపట్ల వరకూ వెళ్లారు. ఇద్దరు సుపుత్రులు, రక్షణశాఖలో వున్నవారు జీపులో మందీ మార్బలంతో వచ్చి న్యూసెన్సు కేసు బనాయించబూని, జనుల్ని చెల్లాచెదరు చేశారు. గృహిణులు, గృహస్థులు తమతమ భాగాల్లోకి దూరారు.

3

రాత్రిబడింది. పెళ్ళిపందిరి కలకలలాడింది. సెంటు వాసనలూ పూలదండల వాసనలూ, పట్టుచీరల జరీఅంచుల తళతళలూ, మోడరన్ నగల మిలమిలలూ, సూటువాలాలూ, పిల్లల సందడీ వన్నె తెచ్చాయి. సుఖాసీనులైనవారూ, నిలబడి వినోదిస్తున్నవారూ,

తివా సీలమీద కూర్చున్న వారూ చూస్తుండగా, అగ్నర వేళ్ళ ముంది రంలా కట్టిన వేదిక మీద, పెళ్ళికూతురూ పెళ్ళికొడుకూ తమల పాకుల్లో వుంచి యిచ్చిన బెల్లం జీలకర్ర ముద్దలను ఒకరి తలమీద ఒకరుంచారు. తాళికట్టే పర్వం, తలంబ్రాల పర్వం చదివింపులు, హారతులు ముగుస్తుండగానే, భోజనానికి రమ్మని ఆడపెళ్ళివారు ఆహ్వానించారు. విందులో వేడుకకి పురుషులు రాగయుక్తంగ పద్యాలూ శ్లోకాలూ చదివారు. ఒక గడసరి భోజనం ముగించి "యెట్టి పెళ్ళివారే వీరూ యెందు ముఖము లెరుగారూ. అరటికాయ అభ్యాసము లేదట, మత్స్యపు సున్నం యెరుగరటా, ఆకువక్క సున్నం అక్కర లేదట ఆ పొగాకు తేతెమ్మందురు" అని పాడింది. మరొక జవరాలు, "యే దేశాన్నించి మా దేశానికొస్తిరీ చక్కాని చుక్క మా జానకమ్మకూ. యెఫ్ఫ బియల్ చదివినారని మా అక్కయ్యని స్తిమీ ఓనమాలు రావని యెరక్కపోతిమీ" అని పాడింది. ప్రత్యర్థి యెగతాళిగా నవ్వి పాడింది. "వదినరో మరియాదగా లేచిరా. అందముగ నీ కుంటికాలికి అందె యిదుగో సుందరముగా, మా వెంట వచ్చిన పెళ్ళివారి విడుపు గుడ్డలు వుతుకు వదినా, వదినరో మరియాదగా లేచిరా" అని పాడి ఉరగా చూపింది. పదేళ్ళమ్మాయి "కొంగామెడా బావా నీదూ సంగాతీ తెలిసెనుపో" అని పాడి నవ్వితే జవాబుగా, "పెళ్ళికూతురు నీకు యింతా పెంకెతనమది యేలనే! పెళ్ళికొమరుని చేయి పట్టవు బింకమెందుకు చెప్పవే" అంటా నవ్వుతూ విందారగించారు. మరునాడు నాగవిల్లి, సాయంత్రం మేజువాణి, పూలబంతి యిచ్చి బంతులాట ఆడతున్నారు. గంధం పూయమని వధువుకీ వరునికీ అన్నీ అందించారు. భోజ

నానికి గంట టైమున్నది. తర్వాత అంపకాలు. ఊరేగింపుకి రమ్మన్నారు. దీపాలు వెలిగి అనంతమివ్వగా రోడ్డుమీద, కార్లూ, ఆటోలూ, సైకిల్ రిక్షాలూ వరసగా వున్నాయి. బాండుమేళం, సన్నాయీ. జానపదుల నాట్యం ముందు సాగిపోతున్నాయి. పని వారు తీపీ, కారం అమర్చిన పళ్లేలు పట్టుకుని పెళ్ళినడకలు నడుస్తున్నారు. నాలుగురోడ కూడలిలో ఆగుతారు, గొప్పవాళ్ళ యింటి ముందు గుడిముందు ఆగుతారు.

అనసూయ కార్లో కూచుంటూ బెల్లిని అడిగింది. "అంపకాలు పెట్టగానే స్టేషన్కు వెళ్లిపోవాలి. వాహనాలిస్తారు. రైలువేళ కాకపోయినాసరే వెళ్ళిపోవాలి. నీవన్నీ చూసుకుని బెడ్డింగ్ ముడిచావా"? "ఆ" అంటున్నది బుల్లెమ్మ. కార్లు, ఆటోలు, సైకిల్ రిక్షాలూ కదిలాయి. రెండువేపులా చూస్తూ పెళ్ళివారు సాగారు.

ఇంక వాలు వెనక్కు తిరగమన్నారు పెద్దలు. మైదానంలో వెనక్కి తిరిగారు బళ్లూ పెళ్ళివారూ.

పెద్దగోల వినబడింది. మంటలు లేచాయి. రవ్వలు ఆకాశం లోకి యెగుస్తున్నాయి. పొగ, పేలుతున్న చప్పుళ్లు, సమయస్ఫూర్తి కలిగిన డ్రైవర్లు బళ్లవాళ్లు యింటికి చేరాలని వేగం హెచ్చించారు. కుతూహలం కలిగినవారూ, ఎక్సైటైనవారూ కేకలూ మంటలవేపు వెళ్లారు. వాళ్లలో అప్పలెల్లున్నారు.

కొంతమంది పనివారప్పుడే మంటల నదుపు చేయాలని

యిసుకా, నీరూ, మట్టీ చల్లుతూ పరుగెత్తుతూ ఆయాసపడుతున్నారు. కొంతమంది యిల్లెక్కి కడవలతో నీళ్లు కుమ్మరిస్తున్నారు. ఇల్లంటు కోకండా చూస్తున్నారు.

మంటలకివతలగా కొంతమంది కొట్టుకుంటున్నారు. మరి కొందరు వారిని విడదీస్తున్నారు. తిట్టుతున్నారు. శాపనార్థాలు పెడుతున్నారు. పెద్ద గడ్డివామి తగలబడుతూ మంటలు నాల్కలు చాస్తే అక్కడ పక్కగా పెరిగిన యెండు రావిచెట్టు అంటుకున్నది. ఆకాశానికి లేచినై మంటలు.

"కసిబోనమ్మ మసిబూసుకున్నదని, అప్పకి యెగనామం పెట్టటమే గాక, పశువులకి గ్రాసం లేకుండా వాముకి నిప్పంటించావే సుబ్బారాయా! నీ చేతులు పడిపోనూ! నీ నోట్లో పచ్చపొగలు రాను! నీకు తిన్నది ఒంటబడుతుందీ? పురుగులు పడి చావవూ! నీకు దెవసం వెట్టా! పశువుల పొట్ట కొట్టావే! వాటి వుసురు తాకదూ? నిన్ను మోయటాని కెవరొస్తారురా? నీ కడుపు మాడా! నీ కోడలు చేసే పన్లకి దుంప నాశనమౌతుంది. ఈ కంటికీ రెప్పలు దూరం కావు. నీ పిండం పిల్లలకి పెట్టా! నేనూళ్ళో లేకుండా చూసి, కుక్కలాగా గోడదూకి వచ్చి వాము ముట్టించావే! నిన్ను ఒలుకుల్లో పెట్టా. నయంగాని శూలనొప్పి రాకపోతే చూస్కో. "నలుగురూ మనిషిని పట్టుకుని వెనక్కు లాగుతున్నారు. పెనగులాడుతున్నాడా మనిషి.

"నింద వేస్తే సరా కామయ్యా! నేనింత నీచానికి దిగలేదంటే నమ్మవేం? చెవులల్లో చెట్లు మొలిచాయా? నా భార్యా పెద్దనగలు

నీ దగ్గరుంచే. వర్గీరేటుకున్నాడా తలూపి అప్పు పట్టుకెళ్తే యెగేశా వంటావా కామయ్యా? వాడిని వదలండయ్యా! ఈ చేపాటి కర్రతో కపాలమోక్షమిస్తాను. మాట మిగిల్తే వూరుకుంటానా? యోగినీల అది. యే కుఃమో! ఇంటికి తెచ్చాడు. మోక్షమిప్పిస్తుందిట. దాని పాదాలు కడిగి దాహం పుచ్చుకంటున్నాడు. వైకుంఠానికి పంపా లంటే వీడి పెళ్లాం నగలే కావాలా యోగినికి? నీ పెళ్లాం తల గొరగ. నీ కోడలు ముండమొయ్య. నీ కూతురు కాపరం గడ్డలు కానూ! నీ మనవడు యుద్ధంలోకి వెళ్లాడు గదూ. తిరిగొస్తే చూస్తా. అవసరమొస్తే బుజం కాస్తా." సుబ్బారాయుడు దుడ్డుకర్ర యెత్తాడు. పదిమంది పట్టి లాక్కెళ్లారు. కామయ్య దూసుకెళ్ళకుండా మరో పదిమంది కమ్ముకుని లాక్కెళ్లారు.

పెళ్లి పెద్దలొచ్చి అరుస్తూ అదలించి వినోదిస్తున్న వారిని తోలుకెళ్లారు. "అయ్యో! అటువంటి వివరాలు చూడరా దన నూయమ్మా. నాకు తెలియదు. ఇంటికెళ్ళి చూస్తే మీరు లేరని గమనించి పరుగెత్తుకొచ్చాను. కేసు అయిందంటే ప్రమాదిస్తే, కోర్టులో సాక్ష్యమివ్వమని సమనులు పంపుతారు. ఇవి మామూలే. శాపనార్థాలు యింతవరకు వినలేదా యేం బుల్లెమ్మా? భోజనాలకి విస్తళ్లు వేస్తున్నారు."

## 4

"డేటా చాలా సేకరించావే బుల్లెమ్మా!" అని నవ్వింది గైడుగారు.

"కొన్నిటికర్థమే తెలియదు మేడమ్. ముఖ్యంగా కాయటమంటే తెలియదు, ముండమోపి, ముండమొయ్యా తెలియదు మీరే చెప్పాలి" అన్నది బుల్లెమ్మ.

"పాడెమీద శవాన్నుంచి లేవదీసేప్పుడు ఖచ్చి నలుగురుండాలి మోయటానికి. సమయానికి మనుషులంద శతృత్వమున్నా, పుణ్యమొస్తుందని వచ్చి బుజానికానించుకు పాడెని. శవపేటిక మోసేవారూ అంతే. అది శాపనార్థం వాడుకలో కొచ్చింది." అన్నది గైడుగారు.

((()))